కథ

కె.సత్యనారాయణ

# బంగారు పంజరం

"డాడీ!" కొంచెం భయంతో, కొంచెం చనువుతో దగ్గరకు చేరాడు దీపు.

"ఏం దీపూ! నీ చదువెలా సాగుతోంది? ప్రోగ్రెస్ రిపోర్టులో ఇంకా నువ్వెనకబడే ఉన్నావు" షూ లేసు కట్టుకుంటూ సమీక్షించాడు మహేంద్ర.

ఈ యూనిఫాం ఎప్పుడూ డ్యూటీ గురించే మాట్లాడుతుంది. భుజం మీద నక్షత్రాలు, నాలుగు సింహాల చిహ్నం, కాలరు బేండు, బెల్టులో డాడీని చూస్తే భయం. అవి వేసుకోగానే మామూలు కన్నా గంభీరం అయిపోతారు. సాయంత్రం తిరిగి వచ్చాక ఛాతీపై తల పెట్టి, కబుర్లు చెప్పాలనిపిస్తుంది దీపుకి. కానీ ఆయన ఛాతీ వరకూ ఫైల్లే. ఒక చేతిలో ఫోన్ రిసీవర్. మరో చేతిలో పెన్ను. దగ్గరకు చేరే సాహసం కూడా చెయ్యలేదు. ప్రోగ్రెస్ రిపోర్టు మాట ఎత్తే సరికి, తను చెప్పాలనుకున్నది బూటు క్రింద తొక్కేశాడు. బిక్కుబిక్కున అక్కడే నిలబడిపోయాడు.

"నిన్నే... ఈసారన్నా నా పేరు నిలబెడతావా? స్కూల్లో నలుగురూ ఏమనుకుంటారు. అంత పెద్ద అధికారి కొడుకు టెన్త్ రాంకు. ఛ..ఛ..." అంటూ విసుక్కున్నాడు.

దీపు తలదించుకున్నాడు. మాట్లాడలేదు. 'నా బాధలు చెప్పుకునే అవకాశం నాకెప్పుడూ ఇవ్వరు. ఆయన పేరు నిలబెట్టుకోవాలని నన్ను స్కూలుకి పంపుతున్నారా? నలుగురి కోసం నేను చదవాలా? నా సంతోషం ఈయనకు పట్టదా?' అని మనసులోనే మథనపడుతున్నాడు దీపు.

"కల్పనా! కల్పనా!" కంప్యూటర్ రూము నుండి వచ్చింది భర్త పిలుపు వినగానే.

"నువ్వన్నా వీడి గురించి పట్టించుకో. ఈసారి ఫస్టు రాంకు రావాలి" అన్నాడు మహేంద్ర.

"అలాగే" కంప్యూటర్ స్క్రీన్‌పై వున్న మనస్సును మరల్చకుండానే, పెదాలపై చిరునవ్వు చూపిస్తూ అంది కల్పన.

ఆమె సమాధానం కోసం ఎదురుచూడలేదు. టోపీ తలపై పెట్టాడు. వేగం దానంతటదే ఊపందుకుంది. దీపు దించిన తల ఎత్తకుండా, నాన్న వైపే చూస్తున్నాడు.

"రాజారాం! బాబుని తొందరగా తయారుచెయ్. స్కూలుకి టైం అవుతోంది" పనివాణ్ని ఆదేశించింది కల్పన. సమాధానం వచ్చే లోపుగానే తన కంప్యూటర్ ముందర వాలిపోయింది.

ఆ ఇంట్లో నలుగురు పనివాళ్లు. ఇద్దరు వంట చేస్తారు. ఒకడు ఇల్లు శుభ్రం చేస్తాడు. మరొక్కడు దీపు పని చూస్తాడు. వీళ్లుకాక ఇద్దరు తోటమాలి పని చూస్తారు. చాలా పెద్ద బంగళా. నాలుగువైపులా ప్రహరీ. గేటు ముందర గార్డు, డ్యూటీలో ఇద్దరు కానిస్టేబుళ్లు రైఫిళ్లు ఎత్తిపెట్టుంటారు. ఈగ కూడా లోపలికి చొరబడడానికి లేదు. లోపలి వాళ్లు బయటకీ, బయటి వాళ్లు లోపలికీ స్వేచ్ఛగా వెళ్లలేరు. ప్రతి కదలిక మీద కన్నుంటుంది. పట్నం మధ్యలో ఆ బంగళా ఒక ద్వీపం. దీపుకి స్నేహితులెవరూ లేరు. ఆట వస్తువులతో ఆడాలి. పనివాళ్లతో మాట్లాడాలి. తను అరచినా, ఏడ్చినా తిరిగి తనకే వినబడుతుంది.

గంటలో దీపును తయారుచేశాడు రాజారాం. టిఫిన్ తినిపించాడు. స్కూల్ బాగ్ భుజాన తగిలించాడు.

"బై మమ్మీ!" అంటూ కంప్యూటర్ రూమ్‌కు దగ్గరకు వచ్చి అమ్మకు చెప్పాడు.

"బై" పరధ్యానంగానే బదులిచ్చింది కల్పన.

కల్పన కంప్యూటర్ ఇంజనీర్. పోలీసాఫీసర్ని పెళ్లి చేసుకుని తన కెరియర్ని నాశనం చేసుకున్నానని బాధపడుతుంది. ఎవరి కోసం, దేని కోసం తను రాజీపడకూడదని, బంగళాలోనే కంప్యూటర్ రూమ్ ఏర్పాటు చేసుకుంది. చాలా సమయం కంప్యూటర్‌తోనే గడుపుతుంది. అవుట్ సోర్సింగ్ చేసి, తనూ సంపాదిస్తుంది. ఒక్కోసారి భర్త జీతం కన్నా తనే ఎక్కువ సంపాదిస్తున్నానని తృప్తి పడుతుంది. అలా ఎప్పటికప్పుడు తన కెరీర్‌ని అభివృద్ధి చేసుకుంటోంది.

జీప్‌లో కూర్చున్నాడు దీపు. వెనక ఇద్దరు గన్‌మెన్లు ఎస్కార్టుగా వెళ్లారు. క్లాసురూము వరకూ దిగనంపారు. స్కూలు చాలా పెద్దది. క్లాసులో ఎవరి కుర్చీ టేబులు వారిదే. క్రమశిక్షణకు చాలా ప్రాధాన్యం ఇస్తారు. దీపు తిన్నగా వెళ్లి తన కుర్చీలో కూర్చున్నాడు. టీచర్ డిక్టేషన్ చెబుతున్నారు. పిల్లలంతా తలెత్తకుండా రాస్తున్నారు. పక్కకు చూసే అవకాశం లేదు. టీచర్ ముఖంలో నవ్వు లేదు. దీపుకి ఆయన కూడా పోలీసాఫీసరులాగే కనిపిస్తున్నారు. సిలబస్ షెడ్యూలు ప్రకారం అయిపోవాలి. ఏ రోజు పాఠం ఆ రోజు పిల్లలు కంఠస్తం చేయాలి. మరుసటి రోజు పరీక్ష ఉంటుంది. పుస్తకంలో పేజీలు లెక్క ప్రకారం దొర్లిపోతుంటాయి. పేజీలు దాటి మాట్లాడడానికి వీల్లేదు. ఇరుగూ, పొరుగూ కబుర్లుండవు. దీపుకి స్కూలుకీ, బంగళాకీ తేడా కనిపించలేదు.

ఇంటర్‌వెల్ కొట్టారు. అయిదు నిమిషాలు సమయం దొరుకుతుంది. అందులోనే టాయ్‌లెట్‌కు వెళ్లాలి. స్నేహితులతో మాట్లాడుకోవాలి. యూనిఫాం నలక్కుండా షోరూంలో బొమ్మల్లా ఉండాలి. కుర్చీల మీద నుండి గెంతడం, చెట్ల వెనుక దాక్కోడం, దాగుడుమూతలు, గిల్లుకోడం, కొట్టుకోడం వంటివేవీ చేయకూడదు. జట్టు కట్టడం, చాడీలు చెప్పుకోవడం ఉండదు. వరండాలో నిల్చుని చెట్లవైపు చూస్తున్నాడు ప్రవీణ్. దీపు దగ్గరకు వెళ్లాడు. ఆరు నెలల్లో కొద్దో గొప్పో స్నేహం ప్రవీణ్‌తోనే అయింది.

"నిన్న సండే ఎలా గడిపావు?" అడిగాడు దీపు.

"మా వీధిలో అయిదుగురు కుర్రోళ్లున్నారు. అందరం కలిసి రంగురంగుల గాలిపటాలు ఒదిలాం. గోలీకాయలు ఆడాం. చాలా సంతోషంగా గడిపాం"

"మీ మమ్మీ, డాడీ నిన్నేమనరా? ఇంట్లో నుండి నిన్నొక్కణ్నే బయటికెలా పంపించారు?" ఆశ్చర్యంగా అడిగాడు దీపు.

"ఒక్కణ్నే బయటికెళితే తప్పేముంది? నేనెప్పుడు కావాలంటే అప్పుడు వెళ్తాను. మా ఇంటికి గోపి, కిషోర్, రమణ వాళ్లు ఎప్పుడు కావాలంటే అప్పుడు వస్తుంటారు. ఆడుకుంటాం"

దీపుకి ప్రవీణ్ మాటలు చాలా వింతగా తోచాయి. వేరొక లోకంలో ప్రవీణ్ వాళ్లు ఉన్నట్లుంది. ఎంత స్వేచ్ఛ, తన ఈడూ జోడూ పిల్లలతో తిరుగుతున్నాడు. మనసుకి నచ్చినట్లు ఆడుకుంటున్నాడు. నౌకర్లు లేరు. తన పని తనే చేసుకుంటాడంట. భయం ఉండదంట.

"హోం వర్కు ఎప్పుడు చేస్తావు?"

"మా నాన్న రాత్రి నా చేత చేయిస్తాడు. ఏ రోజు

వర్క్ ఆ రోజే మా నాన్న చేయిస్తాడు" దీపుకి చాలా బాధ కలిగింది. వాళ్ల నాన్నకు అంత టైం ఉంటుంది. డాడీ చాలా బిజీగా ఉంటారు. ఇంట్లో ఉన్న కొంత సేపూ ఫోన్లూ, ఫైళ్లూ. డాడీకి మెడల్స్ మీద ధ్యాస. మమ్మీకి కెరీర్ మీద ఆసక్తి. ట్యూషన్ మాస్టారు సాయంత్రం అయిదు గంటలకి వస్తారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో అలారం బొమ్మ సమయానికి గంట కొట్టినట్లు పంక్చువల్‌గా వస్తారు. రెండు గంటలు హోం వర్క్. అది కూడా చాలా డిసిప్లిన్. పుస్తకాలను దాటి మాస్టారు ఒక ముక్క కూడా మాట్లాడరు.

"ఆ తర్వాత ఏం చేస్తావు?" ప్రవీణ్ దినచర్య దీపుకి చాలా ఆసక్తి కలిగించింది.

"ఇంట్లో అందరం కలిసి భోజనం చేస్తాం"

"ఏంటి? డైనింగ్ టేబుల్ మీదనా?" ప్రవీణ్ మాటలు పూర్తికాక ముందరే ఆసక్తిగా అడిగాడు దీపు.

"కాదు నేల మీద కూర్చుంటాం. అమ్మ అందరికీ వడ్డిస్తుంది. తను కూడా కలిసి తింటుంది'' సంతోషంగా వివరించాడు ప్రవీణ్.

బంగళాలో కుక్ వండుతాడు. రాజారాం వడ్డిస్తాడు. ఎవరికెప్పుడు తినాలన్పిస్తే అప్పుడు తింటారు. భోజనం ఒక యాంత్రికమైన క్రియ. కెరీర్ నుండి విశ్రాంతి కావాలన్నప్పుడు తిండి వైపు మళ్లుతారు. ప్రవీణ్ కున్నదేదో తనకు లేదన్న బాధ. తనకు లేనివి ప్రవీణ్‌కు ఇంకేమున్నాయో తెలుసుకోవాలన్న ఆసక్తి.

"నీకు కూర నచ్చకుంటే ఏం చేస్తావు?"

"ఏముంది ఏడుస్తాను. మారాం చేస్తాను. అమ్మ బతిమాలుతుంది. నాకేదిష్టమో అడుగుతుంది. చేస్తానని నన్ను ఊరడిస్తుంది"


దీపుకి చాలా ఆశ్చర్యంగా ఉంది. తనూ ఏడుస్తాడు. కానీ రాజారాం దాన్ని వినీవిన్నట్లు తన పని తను చేసుకుపోతాడు. అమ్మ పనుల్లో అమ్మ బిజీ. వంటకి అన్ని సామాన్లూ వంటవాడే కొంటాడు. పళ్లు, కాయలూ, హార్లిక్స్, బోర్న్‌విటా, కార్న్‌ఫ్లేక్స్, జామ్... బజార్లో దొరికేవన్నీ డైనింగ్ టేబుల్‌పై ఎప్పుడూ రెడీగా ఉంటాయి. రకరకాల బేకరీ బిస్కెట్లూ, కేక్‌లూ, పేస్ట్రీలూ అన్నీ ఒక క్రమశిక్షణలో ఉంటాయి. అక్కడ మారాం చేసే అవకాశం, అవసరం తనకు దక్కనే దక్కదు.

"ఆ తర్వాత...?"

"కథలు చెబుతూ నాన్న నన్ను నిద్ర పుచ్చుతాడు. భలేభలే కథలు చెబుతాడు."

టీచర్ పిలుపు విని ఇద్దరూ క్లాసురూంలోకి వెళ్లారు.

స్కూలు పూర్తయింది. ఎవరి వాహనాలవైపు వాళ్లు పరుగులు తీశారు. ఏ స్కూల్లో కూడా దీపు రెండు సంవత్సరాలు పూర్తిగా చదవలేదు. ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు కారణంగా డాడీ ఆఫీసుతో పాటు, దీపు స్కూలు మారుతుంది. ఆరవ తరగతికి వచ్చినా మిత్రులు, శత్రువు అంటూ ఎవరూ లేరు. వెనక్కి తిరిగితే ఒక్కోసారి తను చదివిన స్కూలు పేరు కూడా గుర్తుకు రాదు. దీపు జిప్సీలో కూర్చున్నాడు. ప్రవీణ్ ఇంటివైపుగా పోనియ్యమని అడిగాడు. పుస్తకాల బేగ్ ఇంట్లో వేసి, ఇంటి ముందర స్నేహితుల కోసం ఎదురుచూస్తూ



నిలుచున్నాడు ప్రవీణ్.

జీప్సీ ఆగింది. గన్‌మెన్‌ల అనుమతితో కిందకు దిగాడు దీపు. కొద్దిసేపట్లో స్నేహితులందరూ ఏకవ య్యారు. గన్‌మెన్‌లను కాదని, సాహసం చేసి వాళ్లతో ఆటకు దిగాడు. గోళీకాయలు ఆడారు. దీపుకి ఆనందం పరవళ్లు తొక్కింది. తనను తాను మరచి పోయి ఆడాడు. ఆ పిల్లలందరికీ ఒకే దగ్గర ట్యూషన్. దీపు సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి చేరాడు.

"దీపూ, ఎందుకింత లేటు? ఏంటా చెమట ఒళ్లంతా?" మమ్మీ కోపంతో ప్రశ్నల వర్షం కురిపించింది.

తన సమాధానం వినకుండానే రెక్క పట్టుకుని బలంగా లోపలికి లాక్కెళ్లింది.

"డాడీ రానియ్. నీ సంగతి చెప్తాను. ఎక్కడెక్కడ తిరిగొస్తున్నావో. బొత్తిగా డిసిప్లిన్ లేకుండా పోతుంది" అంటూ కళ్లు ఎర్రచేసింది.

దీపు కారణం చెప్పబోతున్నాడు. అంతలోనే -

"నో ఎక్స్‌క్యూజెస్" అంటూ అతని నోటికి తాళం వేసింది.

"రాజారాం! బాబుని వెంటనే తయారు చెయ్యి. ట్యూషన్ మాస్టారు వెయిట్ చేస్తున్నారు" ఆర్డరు వేసి తన గదిలోకి వెళ్లి పోయింది.

దీపు తయారయి వెళ్లాడు. మాస్టారు కర్తవ్య పరాయణుడై ఎదురు చూస్తున్నారు. ఆలస్యమైనందుకు కోప్పడతారనుకున్నాడు దీపు... లేదు. బహుశా బంగళాలో ట్యూషన్ కావడం వల్లనేమో!

"చూశారా ఈ రోజు దీపు ఏం చేశాడో?" అంటూ కల్పన భర్తకు ఫిర్యాదు చేసింది.

"చదువూ, సంధ్యా లేకుండా తిరుగుతున్నావా?" నిలదీశాడు మహేంద్ర.

"నేనింట్లో ట్యూషన్ చదవలేను డాడీ! మా ఫ్రెండ్సంతా వెళ్లే ట్యూషన్‌కు నన్నూ పంపించండి" స్నేహితులతో ఆడిన ఆనందం దీపుకి ధైర్యాన్ని తెచ్చింది.

"ఇంట్లో ఒక్కణ్ని కూర్చోబెట్టి చెప్పితే ఇలా ఏడ్చింది. వాళ్లందరి మధ్యా చదువుతావా?"


సంశయించాడు మహేంద్ర.

"నాకీ ఒక్క అవకాశం ఇవ్వండి డాడీ! బాగా చదవకపోతే మాన్పించెయ్యండి" అంటూ ప్రాధేయపడ్డాడు దీపు.

ఈ ప్రత్యామ్నాయం కూడా చూడొచ్చని, అయిష్టంగానే అంగీకరించాడు మహేంద్ర.

పురి విప్పి నాట్యం చేస్తున్న నెమలిలా పులకించింది దీపుమనసు. వనంలో గెంతుతున్న జింకపిల్లలా ఉత్సాహంతో ఉరకలు వేసింది దీపుమనసు. రోజూ స్కూలు నుండి నేరుగా ప్రవీణ్ ఇంటికి.. ఆ తర్వాత ఆట. ట్యూషన్. అప్పుడప్పుడు ప్రవీణ్ అమ్మగారు గారెలు, పకోడీలు ఆప్యాయంగా తినిపించేవారు. తన ఈడు వాళ్ల సహవాసంతో దీపుకి కొత్త ఊర్జా వచ్చింది. క్రమశిక్షణతో బిగుసుకుపోయిన కండరాలు సడలి మరింత పటుత్వం సంపాదించాయి. నిర్మల ఆకాశంలో శక్తికొలదీ విహరించాడు.

ప్రోగ్రెస్ రిపోర్టు చూసి, మహేంద్ర తన కళ్లను తనే నమ్మలేకపోయాడు. ఫస్ట్ రాంకు. దీపుకి ఫస్ట్ రాంకు. ఇదివరకటి కన్నా దీపులో చురుకుదనం, ఆనందం ఆయన గమనించాడు. అది చదువులో కూడా చూపించినందుకు సంతోషించాడు. మహేంద్ర మనసులో ఆ క్షణాన తళుక్కున ఒక మెరుపు మెరిసింది. 'ఇంతకాలం బంగారు పంజరంలో పెట్టి, తన కొడుకుకి ఎంత కష్టం కలిగించాడు? తనెంత నష్టపోయాడు?'






## పూనమ్ 'డేర్'

అమాయకంగా కనిపించే పంజాబీ భామ 'పూనమ్ కౌర్' ఎలాగైనా వెలుగులోకి రావాలని ట్రై చేస్తున్నట్టుంది. ఇటీవల వచ్చిన 'శౌర్యం' సినిమాలో గోపీచంద్‌కి చెల్లెలిగా నటించిన ఈ ముద్దుగుమ్మ రాబోయే 'వినాయకుడు' అనే సినిమాలో 'లిప్ టు లిప్' సీన్‌లో కనిపించి సంచలనం సృష్టించబోతోందని ఫిలిం నగర్‌లో తెగ చెప్పేసుకుంటున్నారు. చూడ్డానికి అమాయకంగా కనిపించే ఈ మాజీ 'మిస్ ఆంధ్రా' ఎలాగైనా బాలీవుడ్‌లో నిలదొక్కుకోడానికి కృషి చేస్తున్నట్టుగా వుంది. శుభం.